
sahanamvande.com

epaper.sahanamvande.com

సహనం వందే

హైదరాబాద్ | 30-09-2026 బుధవారం | సంపుటి-02 సంచిక : 161 EDITOR: ROHINI





విద్యార్థులపై డెత్ ప్రైజర్!

సుప్రీంకోర్టు ప్యానెల్ కమిటీ సర్వే రిపోర్ట్ వెల్లడి

- 9 శాతం మందిలో ఆత్మహత్య ఆలోచనలు
- అనేక కాలేజీలలో కుల ప్రాతిపదికన వివక్ష
- చదువుల ఒత్తిడిలో నలిగిపోతున్న జెన్ జెడ్



ఒక్క మార్కు తగ్గితేనే జీవితం అయిపోయిందనుకునే రోజులివి. అలాంటిది దేశంలోని అత్యున్నత కాలేజీల్లో చదువుతున్న వేలాది మంది విద్యార్థులు మానసికంగా ఎలాంటి నరకం అనుభవిస్తున్నారో ఎప్పుడైనా ఆలోచించారా? చదువుకోవాల్సిన వయసులో భావి భారత పౌరులుగా ఎదగాల్సిన సమయాన వారిలో తీవ్ర మానసిక వేదన కనిపిస్తోంది. మన విద్యాసంస్థల్లో విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురవుతున్నారో తెలిస్తే నిజంగా గుండె పగిలిపోతుంది.
- సహనం వందే, న్యూఢిల్లీ

ఉన్నత విద్యాసంస్థల్లో విద్యార్థుల ఆత్మహత్యల ఘటనలు ఈమధ్యకాలంలో బాగా ఎక్కువయ్యాయి. ఈ పరిస్థితిని సీరియస్‌గా తీసుకున్న సుప్రీంకోర్టు, విద్యార్థుల మానసిక పరిస్థితిపై లోతైన పరిశోధన చేసేందుకు ఒక ప్రత్యేక ప్యానెల్ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ దేశవ్యాప్తంగా నిర్వహించిన సర్వే ఆధారంగా బయటకు వచ్చిన గణాంకాలు ప్రతి ఒక్కరినీ విస్తుపోయేలా చేస్తున్నాయి. మన విద్యావ్యవస్థలో దాగి ఉన్న ప్రమాదకరమైన కోణాన్ని ఇది స్పష్టంగా చూపిస్తోంది.

అలముకుంటున్న డిప్రెషన్

ఈ సర్వే వివరాల ప్రకారం... ఉన్నత విద్యనభ్యసిస్తున్న వారిలో దాదాపు 15 శాతం మంది గడిచిన ఆరు నెలల కాలంలో తీవ్రమైన ఒత్తిడి, ఆందోళనకు గురయ్యారు. తమను తాము సంబాళించుకోలేని రీతిలో డిప్రెషన్‌లోకి వెళ్ళిపోయినట్లు స్వయంగా వెల్లడించారు. క్లాస్‌రూమ్‌లు, ల్యాబ్‌లు, హాస్టల్ గదుల మధ్య నలిగిపోతూ తమ మనసులోని బాధను ఎవరితో చెప్పుకోవాలో తెలియక అల్లాడిపోతున్నారు.

ఆత్మహత్య ఆలోచనలు

దీనికంటే భయంకరమైన నిజం మరొకటి ఉంది. పాల్గొన్న వారిలో ఏకంగా 9 శాతం మంది తీవ్రమైన ఆత్మహత్య ఆలోచనలతో బాధపడినట్లు తేలింది. అంటే మనం చూస్తున్న ప్రతీ వంద మందిలో తొమ్మిది మంది జీవితాన్ని చాలించాలనే ఆలోచనతో నలిగిపోతున్నారు. గొప్ప స్థాయికి వెళ్లాల్సిన వయసులో జీవితాన్ని అర్ధాంతరంగా ముగించాలనే ఆలోచనలు రావడానికి క్యాంపస్‌లలోని ప్రతికూల వాతావరణమే కారణమని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

ప్రీమియర్ సంస్థల్లో వరుస విషాదాలు

ఐఐటీ ఢిల్లీ, ఐఐటీ బాంబే వంటి ప్రతిష్టాత్మక సంస్థల్లో వరుసగా చోటుచేసుకున్న ఆత్మహత్యల ఘటనలు దేశవ్యాప్తంగా కలకలం రేపాయి. దేశంలోనే అత్యంత ప్రతిభావంతులైన విద్యార్థులు కూడా ఎందుకు ప్రాణాలు తీసుకుంటున్నారనే ప్రశ్న చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలోనే అత్యున్నత న్యాయస్థానం స్వయంగా జోక్యం చేసుకుని మూల కారణాలను తెలుసుకునే ప్రయత్నం చేసింది.

క్యాంపస్‌లలో వివక్ష, కౌన్సెలింగ్ లోపం

క్యాంపస్‌లలో కేవలం చదువుల ఒత్తిడి మాత్రమే కాదు... కుల, సామాజిక ప్రాతిపదికన జరిగే వివక్ష, తోటి వారి నుండి వచ్చే ఒత్తిడి, ఒంటరితనం కూడా ఈ పరిస్థితికి ప్రధాన కారణాలుగా మారుతున్నాయి. ఇబ్బందుల్లో ఉన్నప్పుడు సాయం కోసం ఎవరిని సంప్రదించాలో చాలామందికి తెలియడం లేదు. దాదాపు 32 శాతం విద్యార్థులకు కాలేజీల్లో కౌన్సెలింగ్ సేవలు అందుబాటులో లేవని తేలింది. ఒత్తిడికి గురైతే సమస్యను చెప్పుకునే వ్యవస్థలు సరిగా పని చేయకపోవడం వల్ల లోలోపలే కుమిలిపోతూ తీవ్ర నిర్ణయాలు తీసుకుంటున్నారు.

తల్లిదండ్రుల ధోరణి...

మన సమాజంలో మానసిక ఆరోగ్యం అంటే ఇప్పటికీ ఒక అపవాదుగానే మిగిలిపోయింది. మానసిక ఒత్తిడి ఉందంటే బలహీనుడిగా ముద్ర వేస్తారనే భయంతో బయటకు వచ్చి మాట్లాడలేకపోతున్నారు. తల్లిదండ్రులు కూడా ర్యాంకులు, ఉద్యోగాల గురించే ఆలోచిస్తున్నారు తప్ప పిల్లల మానసిక స్థితిని పట్టించుకోవడం లేదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

మార్గదర్శకాల దిశగా కమిటీ...

ఈ కమిటీ త్వరలోనే తన నివేదికను సుప్రీంకోర్టుకు సమర్పించనుంది. దీని ఆధారంగా విద్యాసంస్థలకు రాబోయే రోజుల్లో మార్గదర్శకాలు జారీ అయ్యే అవకాశం ఉంది. క్యాంపస్‌లలో మెంటల్ హెల్త్ సెంటర్లను తప్పనిసరి చేయడం, కౌన్సెలర్లను నియమించడం లాంటి కీలక చర్యలు ఊపందుకుంటాయని భావిస్తున్నారు. మార్కులు, ర్యాంకులు మాత్రమే జీవితాన్ని నిర్ణయించలేవు. విద్యావ్యవస్థ అంటే కేవలం సిలబస్ పూర్తి చేయడం కాదని, ఒక మనిషిని సన్మార్గంలో నడిపించే వాతావరణాన్ని కల్పించడమని గుర్తిస్తేనే భవిష్యత్తు తరాలకు మేలు జరుగుతుంది. చదువుల ఒత్తిడిలో నలిగిపోతున్న పిల్లలను కాపాడుకోవాల్సిన బాధ్యత సమాజం, తల్లిదండ్రులు, కళాశాల యాజమాన్యాలపైనే ఉంది. ప్రాణం కంటే ఏ పరీక్షా పెద్దది కాదని విద్యార్థులు గ్రహించాలి.



మార్పు రావాల్సిన సమయం

పిల్లలను ర్యాంకుల వెనుక పరిగెత్తించే క్రమంలో వారి నవ్వులను, ప్రశాంతతను మనం బలి తీసుకుంటున్నామా అనే ప్రశ్న ఈ నివేదిక చూశాక ప్రతీ ఒక్కరిలోనూ కలుగుతుంది. చదువు ప్రాణం తీసేదిగా కాక, ప్రాణం పోసేదిగా ఉండాలి.

నిన్న కత్రినా... నేడు ఐశ్వర్య

ఐశ్వర్యారాయ్ బాడీ షేమింగ్ వివాదం

- పారిస్ ఫ్యాషన్ వీక్‌లో మెరిసిన తార
- సోషల్ మీడియాలో దారుణంగా ట్రోలింగ్
- సెలబ్రిటీల శరీరాలపై మారని సమాజ వైఖరి
- కత్రినా కైఫ్ నుండి మొదలైన వింత ధోరణి

ప్రపంచ వేదికపై భారతీయ అందాన్ని, ఆత్మవిశ్వాసాన్ని సగర్వంగా చాటిచెప్పే నటి ఐశ్వర్యారాయ్ బచ్చన్. ఇటీవల జరిగిన పారిస్ ఫ్యాషన్ వీక్‌లో ఆమె రాయల్ లుక్‌తో రన్ వేపై నడుస్తుంటే అభిమానులు మురిసిపోయారు. కానీ అదే సమయంలో కొంతమంది నెటిజన్లు ఆమె శరీరాన్ని లక్ష్యంగా చేసుకుని వికృత కామెంట్లు చేయడం మొదలుపెట్టారు. అసలు పారిస్ ఫ్యాషన్ వీక్‌లో ఏం జరిగింది? - సహనం వందే, హైదరాబాద్



ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లోని ఈఫిల్ టవర్ ప్రాంగణంలో ప్రతిష్టాత్మక లొరియల్ పారిస్ 'లే డెఫిలే' 2026 ఫ్యాషన్ షో ఘనంగా జరిగింది. ఈ అంతర్జాతీయ వేదికపై భారతీయ బ్రాండ్ అంబాసిడర్‌గా ఐశ్వర్యారాయ్ బచ్చన్ మరోసారి తన ముద్ర వేశారు. కిరీటం, రెడ్ హెయిర్, డ్రామాటిక్ బ్లాక్ వెల్వెట్ దుస్తుల్లో ఐశ్వర్య నిజమైన మహారాణిలా కనిపించారు.

ఈవెంట్ థీమ్, ఉద్దేశం

ఈ ఏడాది లొరియల్ పారిస్ ఫ్యాషన్ షో థీమ్ 'ఎక్స్‌ప్రెస్ యువర్ వర్త్' అని నిర్ణయించారు. మహిళల ఆత్మవిశ్వాసం, స్వయం ప్రతిపత్తి, వైవిధ్యం, అంతర్గత సౌందర్యాన్ని చాటిచెప్పడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఎంతోమంది మహిళలకు స్ఫూర్తిగా నిలిచే తారలంతా ఈ వేదికపై ఒకటై తమ ప్రతిభను చాటారు.

సోషల్ మీడియాలో వికృత ట్రోలింగ్

అయితే ఈ ఈవెంట్ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయిన వెంటనే ఊహించని విధంగా నెగెటివిటీ వెల్లువెత్తింది. ఐశ్వర్యారాయ్ లుక్‌ను, ఆమె నడకను అభినందించాల్సిన కొందరు నెటిజన్లు... ఆమె శరీరాకృతిపై దారుణమైన వ్యాఖ్యలు చేయడం ప్రారంభించారు. ఆమె బరువు పెరిగిందని, కడుపు భాగంలో లావుగా ఉందంటూ కామెంట్లు గుప్పించారు. కొంతమంది నెటిజన్లు ఏకంగా ఆమె గర్భవతి అని ప్రశ్నిస్తే, మరికొందరు ఓజెంపిక్ అనే బరువు తగ్గే మందులు వాడాలని సలహాలు ఇవ్వడం తీవ్ర దిగ్భ్రాంతి కలిగించింది.

కత్రినా కైఫ్‌కు ఎదురైన అనుభవం

బాడీ షేమింగ్ అనే మానసిక దాడికి గురికావడం ఐశ్వర్యారాయ్‌కి మాత్రమే పరిమితం కాలేదు. ఇటీవల నటి కత్రినా కైఫ్ తన కుమారుడు విహాన్ జన్మించిన తర్వాత కూడా ఇలాంటి నెగెటివిటీనే ఎదుర్కొన్నారు. అంబానీ ఇంట్లో జరిగిన గణపతి పూజ వేడుకల్లో కత్రినా పాల్గొన్నప్పుడు ఆమె పోస్ట్ ప్రెగ్నెన్సీ శరీరాన్ని లక్ష్యంగా చేసుకుని దారుణమైన కామెంట్లు చేశారు. ఒక మహిళ తల్లిగా మారినప్పుడు ఆమె శరీరంలో వచ్చే సహజమైన మార్పులను గౌరవించకపోవడం సమాజంలో ఇంకా మిగిలి ఉన్న పాత ఆలోచనా ధోరణిని సూచిస్తోంది.

చిత్రపరిశ్రమ మద్దతు

కత్రినా కైఫ్‌పై జరిగిన బాడీ షేమింగ్‌పై నటుడు సల్మాన్ ఖాన్ బిగ్ బాస్ వేదికగా స్పందించి గట్టి వార్నింగ్ ఇచ్చారు. ఒక మహిళ బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత ఆమె శరీరంలో ఎన్నో మార్పులు వస్తాయని... దానిని గౌరవించడం నేర్చుకోవాలని ఆయన హితవు పలికారు. సల్మాన్ ఖాన్ వ్యాఖ్యలకు సినీ పరిశ్రమ నుండి భారీ మద్దతు లభించింది. పరిణీతి చోప్రా, రిచా చద్దా వంటి కథానాయికలు కూడా మహిళల శరీరాలపై వచ్చే అనుచిత కామెంట్లను తీవ్రంగా ఖండించారు.

మారాల్సిన మన ఆలోచనలు

సమాజంలో సౌందర్య ప్రమాణాలు రోజు రోజుకూ విపరీతంగా మారిపోతున్నాయి. సోషల్ మీడియా యుగంలో ప్రతీ ఒక్కరినీ డిజిటల్ ఫిల్టర్ల వెనుక చూసి అలవాటుపడిన సమాజం... నిజమైన శరీరాలను, సహజమైన మార్పులను అంగీకరించలేకపోతోంది. ముఖ్యంగా సినీ తారలు ఎల్లప్పుడూ ఒకే రకమైన జీరో సైజ్‌లో ఉండాలని కోరుకోవడం ఒక రకమైన మానసిక జాడ్యంగా మారుతోంది.

యూట్యూబ్‌తో కోట్ల వర్షం!

10 లక్షల మందికి పైగా ఫుల్ టైమ్ ఉద్యోగాలు

- కార్పొరేట్ ఉద్యోగాలకు దీటుగా వేతనాలు
- దేశ జీడీపీకి ఏకంగా 18 వేల కోట్ల ఆదాయం
- కేవలం హాబీ కాదు... ఇది ఏకంగా పెద్ద కెరీర్
- కాలక్షేపం నుండి కోట్లు కురిపించే ఇండస్ట్రీ
- యూట్యూబ్ ఇండియా ఇంపాక్ట్ రిపోర్ట్ వెల్లడి

ఒకప్పుడు యూట్యూబ్ అంటే కేవలం వీడియోలు చూసి టైమ్ పాస్ చేసే యాప్ మాత్రమే అనుకునేవాళ్లం. చేతిలో సెల్ ఫోన్ పట్టుకుని ఏదేదో వీడియోలు తీస్తే ఏమొస్తుందిలే అని నవ్వుకున్న రోజులు ఉన్నాయి. కానీ ఇప్పుడు అదే వేదిక ఎంతోమంది జీవితాలను మార్చేస్తూ కోట్లకు పడగలెత్తేలా చేస్తోంది. యూట్యూబ్ ఇప్పుడు ఒక చిన్న యాప్ కాదు... మన దేశ ఆర్థిక వ్యవస్థనే పరుగులు పెట్టించే ఒక పెద్ద ఇండస్ట్రీగా మారింది. - సహనం వందే, హైదరాబాద్



ఈ మధ్యే వెలువడిన 'యూట్యూబ్ ఇండియా ఇంపాక్ట్ రిపోర్ట్ 2025' లోని విషయాలు ఆశ్చర్యం కలిగిస్తాయి. క్రియేటర్ల కష్టం వల్ల మన దేశ జీడీపీకి ఏకంగా 18 వేల కోట్ల రూపాయల ఆదాయం వచ్చి చేరింది. ఆర్థిక వ్యవస్థకు ఈ స్థాయిలో ఉపయోగపడుతుందంటే, మన క్రియేటర్లు ఎంతగా శ్రమిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. దేశానికి ఆదాయంతో పాటు నిరుద్యోగులకు ఇది పెద్ద ఎత్తున ఉపాధి కల్పిస్తోంది. తాజా రిపోర్ట్ ప్రకారం మన దేశంలో దాదాపు 10 లక్షల మందికి దీని ద్వారా ఫుల్ టైమ్ ఉద్యోగాలు లభించాయి. ఒక పెద్ద ఐటీ కంపెనీ లేదా ఫ్యాక్టరీలో పని చేసినట్లే వీళ్లు పూర్తిగా దీన్నే నమ్ముకుని బతుకుతున్నారు. అంతేకాకుండా కెమెరామెన్లు, ఎడిటర్లు, లైట్ బాయ్స్ వంటి మరో 3లక్షల మందికి పరోక్షంగా ఉపాధి దొరుకుతోంది. కార్పొరేట్ ఉద్యోగాల్లో కూడా లభించని వేతనాలు నేడు క్రియేటర్లు సంపాదిస్తున్నారు.

బిజినెస్ సామ్రాజ్యాలుగా అవతారం...

ఇప్పుడు యూట్యూబర్లు అంటే సామాన్యులు కాదు. సెల్ఫీ స్టిక్ పట్టుకుని తిరిగేవాళ్లు సైతం పెద్ద పెద్ద సంస్థలకు సీఈఓలుగా మారిపోయారు. ఉదాహరణకు, 'సింపుల్ ఫుర్' అనే ఛానెల్ 2022లో ఒక చిన్న గదిలో ప్రయాణాన్ని మొదలుపెట్టింది. ఈరోజు వారి కింద 35 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. పైగా 7 వేర్వేరు భాషల్లో కంటెంట్ అందిస్తున్నారు. ఇలాంటి సక్సెస్ స్టోరీలు మన దేశంలో ఎన్నో ఉన్నాయి. చాలామంది యూట్యూబ్‌ను పార్ట్ టైమ్‌గా మాత్రమే చేస్తారనుకుంటారు. కానీ 73 శాతం మంది క్రియేటర్లు ఇదే తమ ప్రధాన ఆదాయవనరు అని చెబుతున్నారు. గతేడాది కొత్తగా 2 లక్షల ఛానెల్స్‌కు మానిటైజేషన్ ఎనేబుల్ అయింది. ఏటా లక్షలు సంపాదించే వారి సంఖ్య 20 శాతం మేర పెరుగుతోంది.

ఏఐ టెక్నాలజీతో భాషా అడ్డంకులకు చెక్

అలాగే ఏఐ టెక్నాలజీ క్రియేటర్లకు ఒక వరంలా మారింది. ముఖ్యంగా భాషా అడ్డంకులను ఇది తొలగిస్తోంది. ఏఐ సాయంతో ఒక ప్రాంతీయ భాషలోని వీడియోను ప్రపంచవ్యాప్తంగా అన్ని భాషల్లోకి సులభంగా డబ్బింగ్ చేసుకోవచ్చు. దీనివల్ల మన తెలుగు వీడియోలను ఇతర రాష్ట్రాల లేదా విదేశీయులు సైతం తమ సొంత భాషలో చూడవచ్చు. అయితే ఏఐ వాడకం వల్ల క్వాలిటీ లేని కంటెంట్ వస్తుందేమోననే భయం ఉంది. దీనిపై యూట్యూబ్ స్పష్టమైన నియమాలు పెట్టింది. సొంత సృజనాత్మకతకు ఏఐని కేవలం ఒక సాధనంగా వాడుకోవచ్చు. ఒరిజినాలిటీ ఉండి, ప్రేక్షకులకు ఉపయోగపడే కంటెంట్ కు మాత్రమే మానిటైజేషన్ లభిస్తుంది.

స్మార్ట్ టీవీలు, యూట్యూబ్ షాపింగ్ హవా

వీడియోలు చూడటమే కాకుండా యూట్యూబ్ లో షాపింగ్ చేయడం కూడా పెరుగుతోంది. దాదాపు 45 కోట్ల మంది యూజర్లు ఏదో ఒక ప్రొడక్ట్ కోసం ఇక్కడ వెతికారు. ఈ షాపింగ్ కంటెంట్ చూసేవారి సంఖ్య 55 శాతం పెరిగింది. అందుకే క్రియేటర్లు తమ వీడియోల్లో వస్తువుల లింక్స్ ట్యాగ్ చేసే ఫీచర్ తెచ్చారు. ప్రేక్షకులు ఆ లింక్ ద్వారా కొనుగోలు చేస్తే క్రియేటర్లకు కమీషన్ లభిస్తుంది. మరోవైపు మొబైల్ ఫోన్లకే పరిమితం కాకుండా స్మార్ట్ టీవీల్లో వీడియోలు చూసే ధోరణి పెరిగింది. మన దేశంలో దాదాపు 7.5 కోట్ల మంది స్మార్ట్ టీవీల్లో యూట్యూబ్ చూస్తున్నారు. ప్రతి ఏటా కొత్తగా 50 నుంచి 70 లక్షల ఇళ్లలోకి స్మార్ట్ టీవీలు వస్తున్నాయి. అందుకే క్రియేటర్లు కూడా పెద్ద స్క్రీన్‌కు తగ్గట్టుగా సినిమా రేంజ్ క్వాలిటీ కంటెంట్ అందిస్తున్నారు.